క్లుప్తంగా

ఏటీఓగా హరిప్రసాద్ బాధ్యతల స్వీకరణ



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఎస్టీఓ కార్యాలయంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా హరిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ ఎస్టీఓ కార్యాలయం నుంచి ఇక్కడికి సాధారణ బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న యాదగిరి మహబూబ్‌నగర్ డీఈఓ కార్యాలయంలో ఎఫ్ఏఓగా స్థానచలనం పొందారు. కాగా నూతన ఏటీఓకు తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శాలువాతో సన్మానించి మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీచర్లకు సంబంధించిన అన్ని రకాల బిల్లులను ఎలాంటి ఆటంకం లేకుండా వేగంగా పూర్తిచేయడానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కో–షాధికారి కిశోర్‌కుమార్, మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది సుధాకర్, గణేష్, శ్రీనివాస్, రాజు, హకీం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీమహంకాళి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ శుద్ధషష్ఠిని పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పసుపు, కుంకుమ, రవిక, తమలపాకులుతో కూడిన నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డీవీ చారి ఎన్నిక



మక్తల్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర పంక్షన్ హాల్‌లో శుక్రవారం 2024–2025 సంవత్సరానికి గాను లయన్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా డివిచారి, కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, కో–శాధికారి అంజన్‌ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ప్రోగ్రాం చైర్మన్ గవినోళ్ల గోపాల్‌రెడ్డి, కో- చైర్మన్‌గా సత్యఆంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం డాక్టర్ పార్వతి, మాదవి, అనిల్‌కుమార్, సునీత, బాలనర్సయ్యకు శాలువాతో సన్మానం చేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజు ఆధ్వర్యంలో సుమారు 50మందికి దుప్పట్లను అందజేశారు. అంతకుముందు మొక్కలు నాటే నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కొండయ్య, శ్రీనివాస్‌గుప్తా, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, కావలి తాయప్ప, చంద్రశేఖర్, చంద్రకాంత్‌గౌడ్, వెంకటయ్య, పృధ్వీరాజ్, శరణప్ప, ప్రభావతి పాల్గొన్నారు.

డైనింగ్‌హాల్ ప్రారంభం



మాగనూర్: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థంకోసం నూతన డైనింగ్‌హాల్‌ను శుక్రవారం జీహెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకార్యర్థం కోసం అవసరమైన బల్లాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యుత్ వంటి సౌకర్యం కల్పించిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కృషిని, తల్లిదండ్రుల శ్రమను గుర్తించి చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఆర్పీ కృష్ణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

కోస్గి: రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తామని దళిత సంఘాల నాయకులకు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తెలియజేశారు. ఈ విషయంపై నేడు దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లకు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ మేరకు.. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేస్తామని లిఖిత పూర్వకమైన హామీని ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి వస్తే తప్ప ఒప్పుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు బ్యాగరి రాములు, పోకల లక్ష్మణ్, వెంకటయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పాఠశాలల పర్యవేక్షణ సాగేదెలా?

- క్లస్టర్ గ్రాంట్స్ నుంచి టీఏ చెల్లించని ఇన్‌చార్జీలు
- ఎమ్మార్సీలకే పరిమితమవుతున్న సీఆర్పీలు
- ఏడేళ్లుగా కోటకొండ క్లస్టర్‌కు లేని సీఆర్పీ



ఎమ్మార్సీలో కూర్చున్న సీఆర్పీలు (ఫైల్)

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులు, అధికారులకు సంధానకర్తలుగా ఉంటూ పాఠశాలలు, క్లస్టర్ ఇన్‌చార్జి, ఎంఈఓలకు అనుసంధానంగా పనిచేయడానికి సీఆర్పీలను నియమించారు. గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాతపరీక్ష నిర్వహించి ఎమ్మార్పీలను ఎంపిక చేసి వారి ద్వారా ఎమ్మార్సీ కార్యాలయ పనులు, పాఠశాల పర్యవేక్షణ బాధ్యతలు చేయించేవారు. అయితే టీచర్లు పాఠశాల వదిలి కార్యాలయానికి రావడంతో విద్యార్థులు నష్టపోతారనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను రద్దుచేసి మండలంలో పనిచేసిన ముగ్గురు ఎమ్మార్పీలను పాఠశాలలకు తిరిగి పంపించారు. ఆ ముగ్గురు స్థానంలో కాంట్రాక్టు పద్ధతిలో కార్యాలయ పనులకు ఒక్కో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్‌లను, మండలంలోని పాఠశాలలను విభజించి క్లస్టర్లుగా మార్చి ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో సీఆర్పీలను నియమించారు.

మండలంలో ఇలా..

మండలం వ్యాప్తంగా 45 పీఎస్, 14యూపీఎస్, 8 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిని ఆరు క్లస్టర్లుగా విభజించి 6మంది సీఆర్పీలను నియమించారు. అదేవిధంగా ఉర్దూ మీడియం పాఠశాలలకు ఒక ప్రత్యేక సీఆర్పీని ఏర్పాటు చేశారు. వీరిలో ఇద్దరు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చి వెళ్లిపోగా, మరో ఇద్దరు పెళ్లిచేసుకుని డ్యూటీని వదులుకున్నారు. దీనికి తోడు మార్కెట్‌లేన్, జాజాపూర్ క్లస్టర్లను తొలగించి నాలుగు క్లస్టర్లుగా కుదించారు. కొల్లంపల్లి, గ్రౌండ్ స్కూల్ క్లస్టర్లకు రెగ్యులర్ సీఆర్పీలు విధులు నిర్వహిస్తుండగా, గర్ల్స్ క్లస్టర్ ఖాళీగా ఉండటంతో ఉర్దూమీడియం సీఆర్పీని బదిలీ చేశారు. ఇక కోటకొండకు సీఆర్పీ లేక ఏళ్ల తరబడి ఈ ముగ్గురు సీఆర్పీలే కొన్ని పాఠశాలలను పంచుకున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

మండల విద్యాశాఖ అధికారిగా మద్దూర్ ఎంఈఓకు ఇన్‌చార్జి ఇవ్వడంతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరగలేదు. తీరా ఆయన ఇటీవల బదిలీల్లో మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లిపోవడంతో పాఠశాలల పర్యవేక్షణ అస్సలు జరగడంలేదు. దీనికితోడు నాలుగు క్లస్టర్లకు ఇటీవలే పదోన్నతిపై కొత్త జీహెచ్‌ఎంలు రావడంతో వారికి ఆయా పాఠశాలలపై ఇంకా పట్టు రాలేదు. వారు సైతం ఇప్పటి వరకు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను పూర్తిగా తనిఖీ చేయలేదని తెలుస్తోంది.

సీఆర్పీలు అంతంత మాత్రమే..

ఇక సీఆర్పీలు సైతం ముగ్గురిలో ఒకరికి సొంత గ్రామానికి చెందిన టీచర్లు అదే క్లస్టర్‌లో పనిచేస్తుండటంతో వారి విషయంలో ఇబ్బందిగా మారగా, మరో సీఆర్పీ మహిళ ఉండటంతో పెద్దగా అన్ని పాఠశాలలకు వెళ్లకుండా కార్యాలయానికే పరిమితమవుతుంది. మిగిలిన మరో సీఆర్పీ పాఠశాలలకు కాకుండా కార్యాలయ పనులు, ఇతర పనులను కేటాయిస్తుండటంతో వారెవ్వరు ఎక్కడా కూడా ప్రభుత్వ పాఠశాల పర్యవేక్షణ జరగడంలేదు. దీనికి తోడూ క్లస్టర్ వారిగా ప్రభుత్వం ఇస్తున్న గ్రాంట్స్‌లో టీఏ, డీఏకు కేటాయించి సీఆర్పీలకు ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడాకూడా సంబంధిత క్లస్టర్ హెచ్‌ఎంలు వారికి ఇవ్వడంలేదని తెలుస్తోంది.

కోటకొండ పరిస్థితి అగమ్యగోచరం :

గత ఐదేళ్లుగా ఇక్కడ సీఆర్పీ లేకపోవడంతో పాఠశాలల పర్యవేక్షణ జరగడంలేదు. పాఠశాలలను పంచుకున్న సీఆర్పీలు ఏ ఒక్క రోజు కూడా ఆయా పాఠశాలల వైపు కన్నెత్తి చూడలేదు.

సీఆర్పీల విధులు :

- పాఠశాలల నుంచి సమాచారం సేకరించాలి
- కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సహకరించాలి
- ప్రతి నెలకు సంబంధించి డైరీ రాయాలి
- ఎస్‌టీపీఎస్ టీచర్లు లీవ్ పెడితే స్కూల్‌కు వెళ్లాలి
- కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలి
- సమాచార సేకరణ, సర్వే, బడిబయటి పిల్లల గుర్తింపు
- పాఠశాల వివరాలు, సమస్యలు, మ్యాప్ తయారు చేయాలి
- రవాణా సౌకర్యం, మధ్యాహ్న భోజనం చూడాలి
- ఎస్‌ఎంసీ సమావేశాలకు హాజరు కావాలి
- ప్రతి పాఠశాలను నెలలో రెండు సార్లు సందర్శించాలి
- ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, ఖాళీలు గుర్తించాలి
- వివిద రకాలైన మేళాలు, పోటీలు న్విహించాలి
- కేజీబీవీలను సందర్శించాలి

మండలంలో..

క్లస్టర్	పాఠశాలలు
కోటకొండ	16
కొల్లంపలి	16
గ్రౌండ్ స్కూల్	18
గర్ల్స్ స్కూల్	17
మొత్తం	67

పరిశీలించి మార్పుతీసుకొస్తాం..



సీఆర్పీలు తప్పకుండా పాఠశాలల తనిఖీకి వెళ్లాలి. నెలలో రెండుసార్లు ఒక్కో పాఠశాల పరిశీలించాలి. హెచ్‌ఎంల నుంచి అన్ని రకాల పత్రాలను సీఆర్పీలే తీసుకుని కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈఓలకు అప్పగించాలి. ఎట్టి పరిస్థితిలో టీచర్లు పాఠశాల వదిలిరాకూడదు. కొత్త సీఆర్పీల నియామకం జరగడంలేదు. కోటకొండ క్లస్టర్ పర్యవేక్షణపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సీఆర్పీలకు కాంప్లెక్స్ గ్రాంట్స్ నుంచి టీఏ చెల్లించే విధంగా ఆదేశాలు ఇస్తాం.

– ఎండీ అబ్దుల్ ఘని, డీఈఓ, పేట

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



జాజాపూర్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న డీపీఓ సుధాకర్‌రెడ్డి



మక్తల్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కౌన్సిలర్ ప్రసన్నరెడ్డి

నారాయణపేట రూరల్: ప్రతి విద్యార్థి విధిగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని డీపీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జాజాపూర్ జెడ్పీస్కూల్‌లో వనమహోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. వారు మాట్లాడుతూ.. పండ్లు, కూరగాయలు, ఔషదమొక్కలపై దృష్టి సారించాలని, మొక్కలు పెంచడంతో వర్షాలు సైతం విరివిగా కురుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భారతి, డీఎస్ఓ భానుప్రకాష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలాజీ, ప్రత్యేకాధికారి శ్రీరంగారావు, ఏపీఓ ప్రవీణ్, టీఏ రాధ, సెక్రటరీ సుమలత పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

కోస్గి/మద్దూర్: పాఠశాలలో విద్యార్థులకు పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం ఔషధ మొక్కలు పెంచాలని సీజీఆర్ సంస్థ ప్రోగ్రాం అధికారి విశ్వేశ్వరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎర్త్‌క్లబ్– యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. అలాగే మద్దూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఔషద మొక్కల గార్డెన్‌ను ఏర్పాటుచేశారు. ఈ సంస్థ వారు ఔషద మొక్కలను విద్యార్థులచే నాటించారు. ఆయా కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య, పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ నరేష్, రవి, తదితరులు ల్గొన్నారు.

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని పల్లెదవాఖానలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కౌన్సిలర్ ప్రసన్నరెడ్డి మొక్కలు నాటి నీరుపోశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, డాక్టర్ విరోచిత, కమిషనర్ భోగేశ్వర్ ఏఎన్‌ఎం సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లలాంటివని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని ముగ్దంపూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుకు ఇరువైపుల ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయగౌడ్, రాము, వెంకటేష్, లక్ష్మణ్, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో మాజీ సర్పంచ్ తిమ్మప్ప ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారులు డీటీ సురేష్, అంజమ్మ, తాయప్ప, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో వనమహోత్సవంలో పాల్గొన్న అధికారులు



ముశ్రీఫా పాఠశాలలో..

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



కోస్గిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నారాయణపేట రూరల్: బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని బొమ్మన్‌పాడు జెడ్పీస్కూల్‌లో విధులు నిర్వహించిన రెడ్డప్ప, శివకుమార్, ప్రసాద్‌రావుతోపాటు విద్యవలంటీర్‌గా సేవలు అందించిన చందనకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. ఎంతో చక్కగా విద్యాబోధన చేయడంతోపాటు తమకు క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తిని నేర్పించిన గురువులు బదిలీపై వెళ్లడం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం బాలాజీ, గ్రామ పెద్దలు భగవంతు, శ్రీనివాస్, రవి, టీచర్లు రుద్రసముద్రంరాములు, విశ్వనాథ్, లింబ్యానాయక్, శ్రీకాంత్, రవికుమార్, పాండునాయక్, వాల్యానాయక్, అనిత పాల్గొన్నారు.

కోస్గి: మండలంలోని సర్జాఖాన్‌పే ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సాయప్ప, కవిత, సబితారాం మంగళ, మల్లయ్యలు బదిలీపై వెళ్లడంతో శుక్రవారం పాఠశాలలో ఆవరణలో వీరికి ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం కృష్ణగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందివడంతోపాటు పదోతరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటలకే ప్రత్యేక క్లాసు ప్రారంభించామని గుర్తుచేశారు. అలాగే నూతనంగా పాఠశాలలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నర్సింహులు, రాములు, సాయప్ప, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.



బొమ్మన్‌పాడులో..

చిన్నారులకు రక్షణ కల్పించాలి

నారాయణపేట రూరల్: చిన్నారులపై అత్యాచారాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని వాల్మీకి బోయకుల అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ముచ్చుమారి గ్రామానికి చెందిన ఎనిమిది సంవత్సరాల చిన్నారిపై ముగ్గురు మైనర్ బాలురు సామూహిక అత్యాచారం చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మానవతా విలువలపై చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, టీచర్లు నేర్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని, మహిళలపై గౌరవం కల్గి ఉండేవిధంగా క్రమశిక్షణ నేర్పించాలన్నారు. కార్యక్రమంలో రమేష్, శరణప్ప, రాములు, చంద్రశేఖర్, విజయ్, ఆనంద్, అంజి, రవి, కిషోర్ పాల్గొన్నారు.




తహసీల్దార్ రాణాప్రతాప్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతు భరోసా సమావేశానికి తరలిన నాయకులు

దామరగిద్ద: ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు శనివారం వనపర్తిలో చేపట్టిన ఉమ్మడి జిల్లా రైతాంగా సమావేశానికి మండల రైతు నాయకులు తరలి వెళ్లారు. రైతు నాయకులు జైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం పేద, మధ్య తరగతి రైతాంగానికి మేలు చేసేలా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారిగా సభలను నిర్వహిస్తుందని తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ పథకం కింద మంజూరైన మూడు అదనపుతరగతి గదులు నిర్మించడానికి శుక్రవారం హెచ్‌ఎం గురురాజారావు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పీఎంశ్రీ రూ. 54లక్షలతో మనఊరు–మనబడి ద్వారా అదనపుగదుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలో చాలా మార్పు తీసుకొచ్చిందని, విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, గ్రామ మాజీసర్పంచ్ రవీందర్, సరస్వతి నాయకులు రాములు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జీహెచ్‌ఎం గురురాజారావు

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల తీరుపై నిరసన

కోస్గి: స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యుల తీరుపై నిరసిస్తూ శుక్రవారం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకృష్ణ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నాకు దిగారు. గురువారం అర్ధరాత్రి తన కొడుకు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యుడు రహీం పేషెంట్‌ను పట్టించుకోకుండా వార్డుబాయితో ఆక్సిజన్ పెట్టాలని చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలో బయటకు వచ్చి వైద్యం చేయాలని కోరిన రూం నుంచి డాక్టర్ రాకపోవడంతో బాధితుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. ఇదే విషయమై ఆస్పత్రి వైద్యులు రహీంను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

చట్టాలపై అవగాహన



మరికల్: పోలీస్ శాఖలో చట్టాలను మారుస్తూ కేంద్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, మారిన చట్టాలతో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ మురళి అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం వివిధ గ్రామాల ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. బ్రిటీష్ నాటికాలం చట్టాలను రద్దు చేసిన స్థానంలో కేంద్రం అమలు చేసిన కొత్తచట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో పగలు ప్రతీకారాలు తగ్గించుకొని ఒకరిపై ఒకరు గొడవలు పడకుండా కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి, గున్ముక్ల, యంనోనిపల్లిలో ఆయా గ్రామాల ప్రజలకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల రక్షణ, నిత్యావసర సరుకుల చట్టం, బాల్యవివాహాలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. వారికి విధించే శిక్షలు జరిమానాలపై ప్రజలకు తెలియజేశారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ మల్లేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, బాలస్వామి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



నారాయణపేట రూరల్: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవేందర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో విద్యార్థులు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తెలియని వారికి సెల్‌ఫోన్ ఇవ్వడం చేయరాదన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయొద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడపరాదని, వాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలన్నారు. కార్యక్రమంలో హోంగార్డు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి

మరికల్: విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు రాజేష్, వేణు, రమేష్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలానికి పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు రాకపోవడంతో విద్యార్థులకు ఉన్నవాటినే సరిపెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండో విడతలో రాని పుస్తకాలను తెప్పిస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకు పంపిణీ చేయలేదన్నారు. తరగతుల వారిగా వెంటనే విద్యార్థులకు సరిపడా నోట్‌పుస్తకాలను తెప్పించి పంపిణీ చేసి మెరుగైన విద్యను అందించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం యాంకి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లిన ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలన చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటినుంచే అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు విద్యార్థులందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులున్నారా? అని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల రిలే దీక్షలు

నారాయణపేట: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారంతో ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు.. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బల్‌రాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినహామీ మేరకు అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 18వేలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో అంగన్‌వాడీలు జమున, యశోధ, అనురాధ, లలిత, శివపార్వతి, తారమ్మ, అనితలు ఉన్నారు.

ఎస్‌జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



పెద్దజట్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



దామరగిద్దలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

దామరగిద్ద: బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయలను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశం విరామ సమయంలో తపస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ సమక్షంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బదిలీ అయిన ఉపాధ్యాయులను న్యాయబద్ధంగా రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుంపు బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, అంబరీష్, విశ్వేశ్వరయ్య, భీమప్ప, విజయలక్ష్మి, బాలమురళి, గీత, నవ్యశ్రీ,, నవభారతి, బాలాజీ, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దజట్రం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలోని భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బదిలీ అయిన ఉపాధ్యాయులను జీఓ నంబర్ 25 ప్రకారం రిలీవ్ చేస్తామని చెప్పడంతో జిల్లా వ్యాప్తంగా 90శాతం ఉపాధ్యాయులు రిలీవ్ కాని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వం ఇక్పటికైనా ఎలాంటి షరతులు విధించకుండా వెంటనే రిలీవ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధనుంజయ, శివకుమార్, సంతోష్‌కుమార్, మంజుల, అనిత, వసుంధర పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను నియమించాలి

మాగనూర్: మండలంలో చాలా పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే పాఠశాలకు విద్యావలంటీర్లను నియమించాలని పీఆర్టీ యూ మండల ప్రధాన కార్యదర్శి తిమ్మన్న ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఉపాధ్యాయులకు నిర్వహించిన ప్రమోషన్లు జిల్లాలోని ఏకోపాధ్యాయులు పాఠశాలనుంచి ప్రమోషన్లలో వెళ్లిపోయిన వారి స్థానంలో విద్యవలంటీర్లను నియమించాలన్నారు.